భోజనం చెయ్యగానే నాలుగు వక్కపలుకులు కులాసాగా నమిలే అలవాటు తీరి కూచుని మానడం ఇష్టంలేదు. పైగా నమలగా నమలగా చిన్నగా మత్తు తలకి ఎక్కేటంత సున్నితమూ పోలేదు. కాస్త నిద్రపట్టి మెలకువ వచ్చేసరికి మాత్రం గొంతు పొడారిపోయి ఉంటుంది.

మంచినీల్లు తాగుదామని వంటగదివేపు వచ్చేను.

అప్పుడు ఆ అమ్మాయి కంచంలో చల్లారిన అన్నంలో పులుసు కలుపుకుని తింటూ ఉంది. టైం చూస్తే మధ్యాహ్నం మూడు దాటింది. ఉదయం టిఫినయినా తిందో లేదో ! పక్కనే అయిదేళ్ల పిల్ల పడుకుని నిద్రపోతోంది. నిన్నటి గౌను కూడా మార్చినట్టు లేదు; చింపిరిజడలూ అదీనూ.

నన్నుచూసి 'ఏం కావాలమ్మా' అంటూ గబుక్కున లేవబోయింది. వద్దని వారించి వంటింట్లోకి వెళ్లాను.

వంటగది మరో అయిదారు గంటలు ఏకధాటిగా పని చేయించుకోడానికి ఎదురు చూస్తోన్నట్లు ఉంది. అంత పని కనిపిస్తోంది అక్కడ.



# 7

డా॥ వాడ్రేవు వీరలక్ష్మీదేవి

# ఆ పిలుపు ఇంకా అందలేదు.



సత్యవతికి అన్నం తిన్నాక పదినిముషాలు విశ్రాంతిగా నడుం వాల్చే అవకాశమూ, చోటూ కూడా లేవని అర్థమయింది నాకు.

నేను ఇవతలికి వచ్చేసరికి కొత్త బంధువులెవరో లోపలికి వస్తున్నారు.

ఈ ఇల్లు మా చిన్నమామయ్యది. ఆయనకి బంధుప్రీతి. నగరానికి వచ్చిపోయే జనాభాతో ఇల్లు ఎప్పుడూ నిండుగా ఉంటుంది. అత్తయ్యకి కూడా వచ్చిన వాళ్లకి కొసరి కొసరి తినిపించే అభిరుచి మెండుగా ఉంది.

కానీ ఆ ఇంట్లో పనిమనిషీ, వంటమనిషీ సత్యవతి ఒక్కతే. భోజనం చేసాక సత్యవతి అంట్లు తోమడం మొదలుపెట్టింది. నేను సాయం చెయ్యబోయాను. కానీ ఆమె రానివ్వలేదు; యజమానులకు తెలిస్తే కోపగిస్తారని, బట్టలన్నీ ఉతికి ఆరవేసేసరికి నాలుగయింది.

మళ్లీ కాఫీలు; కాఫీ గిన్నెలు, కప్పులు కడుక్కోవడమూ....

నిద్రలేచిన పిల్ల ఏడుస్తోంది. ఆ పిల్లకి కాసిని పాలు పట్టే తీరిక లేదు సత్యవతికి. నేను వెళ్లి ఊరుకోబెట్టబోతే దూరంగా జరిగిపోయింది. అలా ఏడుస్తూనే వెళ్లి వాళ్లమ్మని వెనకనుంచి పట్టుకుని కరుచుకుని ఉండిపోయింది. పనికి అడ్డంగా ఉందని సత్యవతి విసుక్కుంటోంది. పిల్ల ఏడుపు ఇంకా పెరిగింది.

ఈలోగా కూరగాయల వాడు వచ్చాడని కిందనుంచి పిలుపు. తనే వెళ్లి రేపటి వంటకి కూరగాయలు తీసుకోవాలనుకుంటూ బహుశా... ఆ పిల్లని సముదాయించే సమయం లేదు.

"సత్యవతీ ! ఇద్దరికి కొంచెం టీ పెట్టమ్మా ! కాఫీ అలవాటు లేదట" అంటూ అత్తయ్య వచ్చింది.

"కిందకు వెళ్లి కూరగాయలు తీసుకోండమ్మా" అంది సత్యవతి.

"నాకు ఈ వచ్చిన వాళ్లతోనే సరిపోతోంది. నువ్వే చూసుకో ఆ సంగతి" అనేసి అత్తయ్య వెళ్లిపోయింది.

నేనేమయినా చేద్దామన్నా నేనూ రెండురోజులు చుట్టపు చూపుగా వచ్చినదాన్నే.

సత్యవతి టీ గ్లాసుల్లో పోస్తుంటే పిల్ల ఆమెని గట్టిగాపట్టుకుని గుంజడంలో టీ కింద వొలికిపోయింది. ఏం జరిగిందో చూసేలోపు సత్యవతి పిల్ల వీపుమీద రెండు బాదింది. దాన్ని బలవంతంగా వదిలించుకుని తీసికెళ్లి బాల్కనీలో కూలేసి వచ్చి పనిలో మునిగిపోయింది. పిల్ల కాసేపు ఏడ్చి బయట రోడ్డుమీద ఆడుకుంటున్న పిల్లల్ని చూస్తూ ఏడుపు మర్చిపోయింది.

అప్పటికి కాస్త ఊపిరి తీసుకునే సమయం దొరికిన సత్యవతికి మాత్రం కన్నీళ్లు వచ్చేయి, పిల్లని అనవసరంగా కొట్టుకున్నందుకు.

సాయంత్రం నేను చార్మినార్ దగ్గర షాపింగ్ చేసుకుని వచ్చేసరికి పది దాటింది.

వీధి వరండాలాంటి బాల్కనీలో కటికనేలమీద ఆ చంటిది పడుకుని నిద్రపోతోంది. బయట చలికి బాగా ముడుచుకుని పడుకుంది. లోపలికి వెళ్లి చూస్తే సత్యవతి డైనింగ్ టేబుల్ దగ్గర నిలబడి భోజనము వడ్డిస్తోంది. మరో దారి లేదని అర్థమయి, నా దగ్గరున్న టవల్ తీసికెళ్లి ఆ పిల్లకి కప్పి వచ్చాను.

ఈ వండి వార్చడంలో, అంట్లు తోమి బట్టలుతకడంలో ఆమెకు ఆ పిల్లను పట్టించుకునే వీలు లేదు.

ఆ తర్వాత ఎప్పుడో అత్తయ్య ద్వారా కొంత, కొంత సత్యవతి ద్వారానూ ఆమె సంగతులు తెలిసాయి.

కథలు వేరు వేరుగా ఉన్నా ఆడవాళ్ళ కష్టాలన్నీ ఒకటే.

భర్త వదిలేసాడు. తల్లీ, తండ్రీ ఆదరించగల స్తోమత లేనివాళ్లు. పెద్దపిల్ల హాస్టల్‌లో ఉండి చదువుకుంటోంది. ఆ పిల్లని చదివిస్తోన్నందుకూ ఈ తల్లి, పిల్లల బాధ్యత వహిస్తున్నందుకు మారుగా ఆ ఇంట్లో ఆమెకు అంత చాకిరీ. బయటకు వెళ్తే వయసులో ఉన్న ఆమెకు రక్షణ లేదు.

ఈ నీడలో భద్రత ఉంది కానీ, విశ్రాంతి లేదు.

చాకిరీ, చాకిరీ, ఒకటే చాకిరీ.

ఒక్కటే ఆశ ఇంత పొగలోనూ. ఆడపిల్లలు ఇద్దరూ చదువుకుని మంచి ఉద్యోగాలు చేసి తనకి చాకిరీ నుంచి విముక్తి ఇస్తారేమోనని.

ఆమె ఆశ ఎంత పేరాశ అయినా దురాశ కాదని నాకు అర్థమయింది. ఎందుకంటే ఈ రెండు రోజులుగా సత్యవతిని చూస్తుంటే ప్రతినిముషమూ మా అమ్మమ్మే గుర్తొస్తూ ఉంది, కాబట్టి...

✿ ✿ ✿

అమ్మమ్మ మంచి వయసులో ఉండగా తాతయ్య పోయాడు. ఇంట్లో చిల్లి గవ్వలేదు. అయిదుగురు పిల్లలు. ఆఖరి పిల్లకి ఆరోనెల. ఆ పిల్లని కాళ్ళమీద పడుకోబెట్టుకుని స్నానం చేయిస్తుండగా పొలం వెళ్లిన తాతయ్యని పాము కరిచిందని తీసుకొచ్చి వాకిట్లో పడుకోబెట్టారు. వైద్యం జరిగే లోపే చనిపోయాడు. అమ్మమ్మకి కన్నీళ్లు కూడా రాలేదట. గుండె రాయయిపోయిందట. తర్వాతి రోజులన్నీ మరిది ఇంట్లో చాకిరీ చేస్తూ గడిపింది. పెద్దపిల్లలు బయటి పనుల్లో మరిదికి సేవ చేస్తుంటే తను ఇంట్లో వంటపని. తోటి కోడలికి ఏటేటా కాన్పులు. ఇంట్లో జనం, పాలికాపులు, బయట నుంచి వచ్చే ఆఫీసర్లు అందరికీ పొయ్యిమీద వండి వార్చడం, వడ్డించడం. మరిది ఆ ఊరు మునసబు. పగలనక, రాత్రనక ఇంటెడు పనీ తనే చేసేది. సంగతులన్నీ అమ్మమ్మ నాకు తరచుగా చెప్తుండేది. పిల్లలు చిన్నవాళ్లు. వాళ్లు తిండి తిన్నారో, లేదో చూసే వీలు కూడా ఉండేది కాదట. ఎప్పుడో తిని ఎక్కడో పడుకుని నిద్రపోయేవారు. రెండు రోజుల కొకసారి కాస్త వీలు చేసుకుని తలలు దువ్వి జడలు వెయ్యడమే గగనం.

కానీ అమ్మమ్మ చాకిరీకి కొన్నేళ్ళకయినా

విముక్తి దొరికింది. పెద్ద మామయ్య చిన్న ఉద్యోగం సంపాదించుకుని అందరినీ వేరే తీసుకొచ్చేసేడు. చిన్న ఇంట్లో నలుగురు మనుషులకి చిన్న వంటతో అయినా అమ్మమ్మ నిర్విరామంగా పనిచేసేది.

కందులు వేయించి విసిరి పప్పు చేసేది. నువ్వులు కడిగి గానుగకి పంపి నూనె ఆడించేది. బియ్యం విసిరి నూక చేసేది. చివరికి పత్తి గింజలు తీసి వత్తులు చేస్తూ ఉండేది. ఒకటేమిటి. తన కొడుకు ఇంటిని సౌభాగ్యంతో నింపేది.

ఆ అమ్మమ్మని తర్వాతి కాలంలో నేను నా దగ్గిరికి తీసుకొచ్చేసేను. ఆరోజుల్లో మా కుటుంబాలలో చదువుకుని ఉద్యోగం చేసే ఆడపిల్లని నేనే. నాతో మా అమ్మమ్మ.

"నీ దగ్గరికి వచ్చాకే నాకు విశ్రాంతి దొరికింది" అని ఆ సమయాన్ని పుస్తకాలు చదువుతూ గడిపేది. ఇద్దరం కలిసి అప్పుడప్పుడు సినిమాలకీ, దేవాలయాలకీ సమానంగా వెళ్లేవాళ్లం. దేనికీ ఎక్కువ ప్రాధాన్యత లేదు. ఆ తరం స్త్రీ విశ్రాంతి సమయాన్ని గడిపిన విధానమే నాకు ఆదర్శమయింది. ఎందులోనూ ఇరుక్కోకుండా ఉండడం కూడా.

ఇరుగు పొరుగులతో కబుర్లూ, కాలక్షేపాలూ ఆమెకు తెలియవు. పనిని ఒక ధ్యానప్రక్రియలాగ నిదానంగా, స్థిమితంగా చేసేది.

ఎన్నో ఏళ్ళపాటు ఎవరి ఇంట్లోనో పనిచేస్తూ బతికినా ఆమె లోపల దైన్యభావం ఏర్పడలేదు. పని ఆమెకు ఆత్మవిశ్వాసాన్నిచ్చింది.

**ఆమె ఇలా ఈ రోడ్డు నడిబొడ్డున నిబ్బరంగా, నిశ్చింతగా తన వృత్తి తాను చేసుకోడానికి ఎన్నింటి నుంచి విడుదల అవుతూ వచ్చి ఉంటుంది?! ఇంతదాకా ఎన్నింటిని విదుల్చుకుంటూ వచ్చింది ?!**

**ఇలా రాగలిగిన ఈ స్త్రీ నాలో ఒక ఆనందపు కెరింతను కలిగించింది. అది ఒక రివెలేషన్.**

చిన్న ఇంట్లో అమ్మమ్మా నేనూ. నా జీతం తీసికెళ్లి తనకే ఇచ్చేదాన్ని. మొదటిసారి ఇవ్వగానే అమ్మమ్మ చెప్పింది. ఇలానోట్లు చేత్తో తాకడం ఇదే మొదటిసారి అని. భర్తగానీ కొడుకులు గానీ ఆమె చేతికి ఏ రోజూ డబ్బు ఇవ్వలేదట. అవసరాలు తీర్చేవారు.

ఆడపిల్ల సంపాదిస్తోంది కనుకనే తను చేత్తో తాకగలిగేనని అనుకునేది అదే మనవడైతే తనచేతికి ఇవ్వకుండా వాడే ఖర్చు పెట్టునని ఆమె నమ్మకం.

జీవితంలో కష్టమూ, శ్రమించడమూ తెలియడం వల్లా, అవి రెండూ ఒకటి కాదని తెలియడం వల్లా కూడా మా అమ్మమ్మ నా చిన్న ఇంటిని ఎప్పుడూ సుసంపన్నంగా ఉంచేది. ఎవరు ఏ వేళ వచ్చినా లోటు లేకుండా ఉండేది.

ఆ అమ్మమ్మ ఈ రోజు లేదు. కానీ ఏ ఆడకూతురి శ్రమ చూసినా ఆమె నా కళ్ళముందుకి వస్తుంది.

"అమ్మమ్మా ! ఈ వయసులో కూడా ఇంకా నీకీ వంటపని తప్పడం లేదు నా వల్ల" అనేదాన్ని.

"ఇదెంత పనే నాకు –? ఆడుకున్నట్టుంటుంది" అనేది.

సత్యవతి ఆమె కష్టానికి దిగులుతో బాటు అమ్మమ్మని జ్ఞాపకం చేసి బెంగని కూడా కలిగించింది.

నిద్ర పట్టడం లేదు. అట్నించి ఇటు ఒత్తిగిల్లేను. అప్పటికి వినిపించింది ప్రక్కనే వున్న హేండ్‌బేగ్‌లోని సెల్‌ఫోన్ పిలుపు. తీసి చూస్తే ఎనిమిది మిస్‌డ్ కాల్స్. ఎనిమిదీ సువర్చలవే.

ఈమారు బయల్దేరేటప్పుడు చాలా పనులు అప్పజెప్పింది నాకు. నిజానికి నా పని కంటె ఆమె చెప్పిన పనులే ఎక్కువ ఉన్నాయి. వాటిసంగతి కనుక్కోడానికో, లేదా అదనపు పనులు పురమాయించడానికో అయి ఉంటాయి ఈ ఆగని పిలుపులు.

మళ్ళీ మోగగానే తీసాను.

"అరగంటనుంచి కాల్ చేస్తున్నాను. ఏమైపోయావ్"

"బాత్‌రూంలో ఉన్నా" చిన్న చిన్న అబద్ధాలు అలవాటు చేసుకోకపోతే ఈ సెల్‌ఫోన్ పిలుపులు తినేస్తాయి మరి.

అయినా ఒక పిలుపుకి తియ్యకపోతే కాస్త ఇంగితం ఉన్నవాళ్లు అయితే ఆగాలి. ఎంత అర్జంటయినా సరే కనీసం పావుగంటయినా ఆగాలి.

ఇదంతా ఆమెకు అర్థం కాదు.

"సరే చెప్పు" అన్నాను.

"చార్మినార్ దగ్గర నేను చెప్పిన తెల్లరాళ్ళ గాజులు దొరికాయా?"

"ఆ దొరికేయి. కొన్నాను."

"రెండేసి వరుసల రాళ్ళున్నవేనా"

"అవును – అవే"

"కాపర్ కోటెడ్ గాజులు దొరికాయా?"

ఇక అన్నీ ప్రశ్నలే. ఊ కొడుతూ ఉన్నాను.

"క్రిప్ శారీస్‌కి కుందన్స్ అతికిన బోర్డర్స్ తెమ్మన్నాను కదా ! అవి దొరికేయా?"

"అరె ! ఈ శారీ బోర్డర్స్ మర్చిపోయాను."

"నాకు తెలుసు. అందుకే లిస్టు రాసి ఇచ్చాను. అవి మా ఫ్లాట్స్‌లో అందరికంటె ముందు నేనే చీరలకి అటాచ్ చేసి కట్టుకుని చూపించాలి. అందుకే నీకు చెప్పేను. నేను వెళ్లేటప్పటికి లేట్ అవుతుందని; ఈలోగా ఎవరేనా ముందుగా తెప్పించుకుని కట్టేసుకుంటారేమోనని. నన్ను డిజప్పాయింట్ చెయ్యకు. ఎలాగయినా రేపు తీసుకో. రేపు సాయంత్రమేగా నీ రిటన్ జర్నీ."

సువర్చల మావదిన. కజిన్ భార్య. జూనియర్ కాలేజీలో ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఫేకల్టీ. ఒక కార్పొరేట్‌సంస్థ అది. ఆమె డిగ్రీలకీ, అనుభవానికీ ఆ సంస్థ ఆమెకు పెద్ద మొత్తమే జీతంగా ఇస్తోంది.

పాఠాలు చాలా చక్కగా చెప్పగలదు. అంతవరకే ఆమె చదువు. ఇంట్లో వంటకి మంచి పిల్లని వెతుక్కుంది. పిల్లల చిన్నప్పుడు కూడా వాళ్ల హోంవర్కులకి ఒక డిగ్రీ చదివే బీదపిల్లని అయిదు వందల రూపాయలికి ఎప్పాయింట్ చేసుకుంది. ఇప్పుడు వాళ్లు ఉద్యోగాలు చేసుకుంటున్నారు. చాలా సమయాన్నే మిగుల్చుకుంటుంది.

కానీ ఎప్పుడూ అశాంతిగా, ఆందోళనగా ఉంటుంది. ఏదో ఒక మానసిక ఒత్తిడి ఆమెను స్థిమితంగా నిలబడనివ్వదు.

బీరువాల్లో దాదాపు మూడు వందల చీరలున్నాయి. బంగారానివీ, కానివీ కూడా రకాల నగల సెట్లు ఉన్నాయి. కిట్టీపార్టీల్లో చాలా పేరుంది. అప్పుడప్పుడు ఏదో సేవాకార్యక్రమాలకు కూడా తయారయి వెళ్తూ ఉంటుంది. ఎప్పుడు చూసినా నిముషం ఖాళీ లేకుండా హడావిడిగా అవిశ్రాంతంగా ఉంటూ ఉంటుంది.

ప్రస్తుతం కొత్తగా వచ్చిన టైడల్ వేవ్‌లాంటి మెరుపుల చీరల హడావిడిలో కొట్టుకుపోతోంది. బీరువాలోని పాత చీరలన్నీ తీసి వాటన్నిటికీ ఈ 'మెరుపుల మరకలు' అంటించే పని యుద్ధ ప్రాతిపదికమీద చేస్తోంది.

నేను ప్రశ్నించబోయినా ఆమెకు వినే తీరిక

లేదు. మళ్లీ ఫోన్‌లో ఆమె చెప్పిన లిస్ట్ అంతా విన్నాను. ఇక ఆవలిస్తూ గుడ్‌నైట్ చెప్పి పడుకున్నాను.

తెల్లవారుఝామున మెలుకువ. లేచి మంచి నీళ్లు తాగేటంతగా గొంతు పొడారిపోయింది. వక్క పొడి వేసుకోవడం వల్ల అనుకుంటా. చీకట్లో తడుము కుంటూ వెళ్ళి వంటింట్లో చూస్తే బిందెల్లో అడుగుకే పోయి ఉన్నాయి నీళ్లు నలకలతో. ఫ్రిజ్‌లో బాటిల్స్ ఎప్పుడో ఖాళీ. తప్పక ఆ నీళ్ళే తాగేను.

అమ్మమ్మ కలలోకి వచ్చినట్టుంది. అటు వంటి స్పృహ ఏదో కలుగుతోంది ఈ మెలుకువలో. వచ్చి పక్కమీద కూర్చుని కలని గుర్తు చేసుకున్నాను. భలే నవ్వొచ్చింది.

అమ్మమ్మ సువర్చల బీరువా దగ్గర నిలబడి చీరలన్నీ తీసి మంచం మీద పడేస్తోంది. బీరువాలో పది చీరలే లెక్కపెట్టి ఉంచింది. రెండోబీరువా కూడా తెరిచి చీరలు తీస్తుండగా సువర్చల గదిలో కొచ్చింది అమ్మమ్మ ఈ చీరలన్నీ మూటగట్టి ఏదో ఆశ్రమంలో పనిచేసే ఆడపిల్లలకి ఇచ్చేస్తానంటోంది. సువర్చల గట్టిగా అరుస్తోంది ఒక్క చీర కూడా తాకడానికి వీల్లేదని. ఇంకా ఏదో జరిగింది గానీ గుర్తు రావట్లేదు.

అమ్మమ్మ పోయేక అన్నయ్య పెళ్లి అయి, సువర్చల మా ఇంటికి వచ్చింది. ఆమెకు అమ్మమ్మ తెలీదు.

రాత్రి నా ఆలోచనలన్నీ కలగలిసిపోయా యన్నమాట.

✿ ✿ ✿

ఉదయం సత్యవతి పెట్టిన దోసెలు తిని రోడ్డు మీద పడ్డాను. ఇక సువర్చల షాపింగ్ కోసం ఆటో ఎక్కి బజారున పడాలి. ఆటో ఎక్కి బేగ్ తెరిచి వక్క పొడి కోసం వెతికేను. ఖాళీ పొట్లం చేతికి తగిలింది. ఒకటి, రెండు చోట్ల ఆగేను కొందామని కానీ నాకు కావలసినది దొరకలేదు. మనసు వక్కపొడి మీదకి పోతోంది. అలవాటు చిన్నదే అయినా దానికి చిక్కితే చికాకు కలిగిస్తోందన్న సత్యం ఒప్పుకు తీరాలి మరి.

ఇలాగే మొదలవుతుంది జీవితం ఊహల లోంచి జారిపోయి చికాకులతో సాగుతుండడం; మనకి ఎక్కడా దొరక్కుండా.

ఆటో దిగిజంక్షన్‌లో రోడ్ దాటబోతుంటే చెప్పు తెగిపోయింది. చిన్నపట్టు కూడా లేకుండా పూర్తిగా ఊడ్చుకుంటూ నడవడానికి కూడా వీలుగా లేదు. ఇక తప్పక చెప్పులు విప్పి చేత్తోపట్టుకుని ఇబ్బందిగా ఇటూ, అటూ చూస్తూరోడ్ దాటాను.

ఎక్కడేనా చెప్పులు కుట్టేవాళ్లు దొరుకు తారేమో అని చూస్తుంటే సరిగ్గా సెంటర్లో ఒకపక్కకీ ఉన్న చెట్టు కింద ఆచూకీ దొరికింది. బతుకు జీవుడా అనుకుంటూ చెప్పులు ఎడమచేత్తో మోసుకుంటూ వెళ్లేసరికి అక్కడ చెప్పులు కుట్టే అతను లేదు.

చుట్టూ పరిచి ఉన్న తోలు సామాను, పాత చెప్పుల మధ్య ఆమె కూర్చుని ఉంది.

"ఇక్కడ ఎవరూ లేరా?" అనడిగాను.

"ఏం కావాలి" అంది నిర్లక్ష్యంగా

"అదే... చెప్పులు కుట్టే అతను లేడా ?"

"ఏం కావాలి చెప్పు ?" అంది.

చెప్పులు చూపించేను. కుట్టాలి అని చెప్పేను.

ఆమె దూరం నుంచే చూసి "ఎనిమిది రూపాయలవుతుంది"అంది. అప్పటికి అర్థమయింది. ఆ కొట్టు ఆమెదే. అంటే ఆమే దాన్ని నడుపుతోంది. ఆ తెలివికి లోపల్లోపల విస్తుపోయాను. పైకి మాత్రం బేరం పెట్టేను అయిదు రూపాయ లిస్తానని.

"ఏందమ్మా ! బేరాలాడతావు. ఎనిమిది రూపాయలకి తక్కువలేదు" అంది. మారు మాట్లాడ కుండా తెగిన చెప్పు అందించేను.

అవలీలగా కుట్టిపడేసింది.

ఆమె చెప్పినట్టే రెండు చెప్పులూ కాళ్ళకు తొడుక్కుని ఎనిమిది రూపాయలూ ఇచ్చి పరధ్యానంగా నడవడం మొదలు పెట్టాను.

తెలీకుండా చాలాదూరమే నడిచాను. ఈ నడకంతా ఆమె గురించే ఆలోచన. మనసుకి ఏదో ధైర్యం తోచినట్టుగా ఉంది.

ఆమె ఇలా ఈ రోడ్డు నడిబొడ్డున నిబ్బ రంగా, నిశ్చింతగా తన వృత్తి తాను చేసుకోడానికి ఎన్నింటి నుంచి విడుదల అవుతూ వచ్చి ఉంటుంది?! ఇంతదాకా ఎన్నింటిని విదుల్చుకుంటూ వచ్చింది ?!

ఇలా రాగలిగిన ఈ స్త్రీ నాలో ఒక ఆనందపు కేరింతను కలిగించింది. అది ఒక 'రెవెలేషన్'.

ఆటోలోంచి కాలు కిందపెట్టిన నేను చాలా దూరమే నడిచాను. ఎవరినీ కాదనలేని బలహీనత వల్ల సువర్చల కోసం ఈ షాపింగ్ బెడద భుజాన వేసుకున్నాను.

కానీ ఇప్పుడు అవేవీ కొనాలని లేదు.

'నాకు కుదరలేదు' అని వదినతో ఖండితంగా చెప్పగల ధైర్యం వచ్చినట్టయింది. సువర్చల వదిన చాలా 'అప్‌సెట్' అవుతుంది. ఇన్నాళ్లూ సత్యవతి లాంటి వాళ్ల అవిశ్రాంతమయిన చాకిరీ గురించి, కష్టాల గురించి బాధపడ్డాను గానీ వాళ్లు ఎప్పటి కయినా దాని నుంచి విముక్తులవుతారు. వాళ్ళకి దేని నుంచి విముక్తి కావాలో తెలుసు గనుక.

కానీ మా సువర్చల వదినలాంటి వాళ్లకి తమని ఏవి చుట్టుకుని ఉన్నాయో, వేటినుంచి విముక్తమవ్వాలో కూడా తెలీదు, ఎంతోమంది మగవాళ్లలాగ.

అధికారం, డబ్బు, ఆకర్షణలు, వ్యామోహాలు ఎన్ని కొండ చిలువలు - నేను మాత్రం నడక ఆపలేదు కనీసం......

## సహచర్య

### జగద్ధాత్రి

**ఆ**తని మేధోగగనంలో
సృజనావేశపు మెరుపు మెరిసినపుడు
అతని కన్నుల్లో ప్రజ్వలించే
కాంతిని చూసి మైమరచిపోతాను
తన మునివేళ్ల స్పర్శతో
నన్ను పునీతురాలిని చేసే
ఆ సుమధుర క్షణం కోసం
నిలువెల్లా కనులై నిరీక్షిస్తాను
తన స్పర్శామాత్రంతో నా లోనికి ప్రవహించే
ఉద్విగ్నతనూ, ఉత్తేజాన్నీ
అనుభూతిస్తూ....
అక్షయ భావలహరినౌతాను
అనుభూతులను, ఆవేదనలను
అక్షరీకరించడానికి ఆలవాలమౌతూ
ఆనంద మథనమౌతాను
అభిప్రాయాన్నో, అభిమతాన్నో, అభిశంసనో
సమాజానికి సందేశాన్నో
తాను వెలువరిస్తున్నపుడు
పదాల వెల్లువనై పరవశించిపోతాను
కాగితపు దేహాలను
సిరా పుష్పాలతో అలంకరించి
అలసి సొలసి
నా అక్షర బ్రహ్మ నిదురిస్తే
మరో జీవన సాఫల్య క్షణంకోసం
ఎదురు చూస్తూ....
అతని గుండెలపై
సేద తీరుతాను
సంతృప్తనై !!!